# తొలి అక్షరం

చైర్మెన్ & చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

తెలుగు దిన పత్రిక

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 01 సంచిక - 264 పేజీలు - 6 గురువారం 15 ఆగస్టు 2024



## విలేకరులు కావలెను

**తొలి అక్షరం తెలుగు దిన పత్రిక**

వినూత్నంగా వెలువడుతూ, విశేష ప్రజాధరణ పొందుతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రికకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో విలేకరులు కావలెను.ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాను tholiaksharam@gmail.comకి మెయిల్ చేయగలరు. సీనియర్లకు పాధ్రాన్యం, కొత్తవారికి కూడా అవకాశం,నియామకాలు జరుగుతున్నాయి వెంటనే సంప్రదించండి.


## హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్ బృందం

### శంషాబాద్‌లో ఘనంగా స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి (పి.సైదులు), ఆగస్టు14:** సీఎం రేవంత్‌రెడ్డి బృందం విదేశీ పర్యటనను ముగించుకుని హైదరాబాద్ చేరుకుంది. అమెరికా, దక్షిణకొరియాలో సీఎంతో పాటు, మంత్రి శ్రీధర్‌బాబు, పలువురు అధికారులు పర్యటించారు. రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా ఆయా దేశాల్లో వివిధ సంస్థల ప్రతినిధులతో సీఎం బృందం సమావేశాలు నిర్వహించింది. సీఎం బృందానికి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ శ్రేణులు స్వాగతం పలికారు. అమెరికా, దక్షిణ కొరియా పర్యటనల తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. రేవంత్ రెడ్డి అమెరికా, దక్షిణ కొరియా పర్యటన విజయవంతంగా ముగిసిందని శ్రేణులు పెద్ద ఎత్తున విమానాశ్రయానికి చేరుకున్నారు. పెట్టుబడులే లక్ష్యంగా సీఎం విదేశీ పర్యటన సాగగా.. చాలా రోజుల తర్వాత రేవంత్ రెడ్డి హైదరాబాద్ కు చేరుకున్నారు. ఈ నెల 3న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని రాష్ట్ర ప్రతినిధి బృందం అమెరికాకు వెళ్లింది. 10న అమెరికా నుంచి బయలుదేరి

వివరాలు 2లో

## రాష్ట్ర ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్



**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు14:** భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో మహనీయుల పోరాటాలు, మరెందరో బలిదానాల ఫలితంగా సాధించుకున్న దేశ స్వాతంత్ర్య ఫలాలు చివరి గడపకూ చేరిన నాడే సంపూర్ణ సార్థకత చేకూరుతుందని అన్నారు. మహాత్మా గాంధీ నడిపించిన భారత స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో శాంతియుత మార్గంలో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం, ప్రజల సహకారంతో పదేండ్ల అనతికాలంలోనే దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. అన్నిరంగాల్లో సబ్బండ వర్గాల అభ్యున్నతి దిశగా దేశ పాలకుల కార్యాచరణ మరింత చిత్తశుద్ధితో అమలుచేసి ఫలితాలు సాధించడం ద్వారా మాత్రమే స్వాతంత్ర్య పోరాట త్యాగధనులకు మనం అర్పించే ఘన నివాళి అని కేసీఆర్ పేర్కొన్నారు.

## ఎమ్మెల్సీల నియామకానికి లైన్ క్లియర్

- హైకోర్టు తీర్పుపై స్టే విధించిన సుప్రీం
- నియామకాన్ని అడ్డుకోలేమన్న సుప్రీం కోర్టు







## కంపు కొడుతున్న పల్లెలు, పట్టణాలు

- కాంగ్రెస్ పాలనలో పారిశుద్ధ్యం కొరవడింది
- నిధులు విడుదల లేక నీరసించిన గ్రామాలు
- మాజీమంత్రి కెటిఆర్ ఘాటు విమర్శలు

## ఆర్టీసీ డిపోల ప్రైవేటీకరణ దుష్ప్రచారం: సజ్జన్నార్



**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు14:** రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ డిపోలను ప్రైవేట్ పరం చేస్తున్నారని జరుగుతున్న ప్రచారం అవాస్తవమని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం స్పష్టం చేసింది. సంస్థ ప్రతిష్టకు భంగం కలిగించేలా కొందరు చేస్తోన్న ఈ దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపింది. కేంద్ర ప్రభుత్వ ఈవీ పాలసీ ప్రకారమే పర్యావరణహితమైన ఎలక్ట్రిక్ బస్సులను ప్రయాణికులకు అందుబాటులోకి సంస్థ తీసుకొస్తోందని పేర్కొంది. డిపోల్లో ఎలక్ట్రిక్ బస్సులతో సహా అన్ని బస్సుల ఆపరేషన్స్ నిర్వహణ పూర్తిగా టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలోనే జరుగుతుందని, అందులో ఎలాంటి అనుమానాలు అవసరం లేదని వెల్లడించింది. ఈ మేరకు సదరు సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ సోషల్ మీడియా వేదికగా సుధీర్ఘ పోస్టును పంచుకున్నారు.

## నేడు సీతారామకు ప్రారంభోత్సవం

- సిఎం చేతుల మీదుగా పైలాన్ ఆవిష్కరణ
- వైరాలో భారీ రైతు సభ..చివరిదశ రుణమాఫీకి నిధుల విడుదల



**తొలి అక్షరం/భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్టు14:** జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. దశాబ్దాల సాగు నీటి కల సాకారం చేసే సీతారామ ప్రాజెక్ట్‌ను ఆగస్టు 15న ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేయను న్నారు. ముల్కలపల్లి మండలం పూసుగూడెం వద్ద పైలాన్ ఆవిష్కరించనున్నారు. పంప్ హౌస్ మోటార్లు స్విచ్ ఆన్ చేసి డెలివరి సిస్టర్న్ వద్ద గోదారమ్మకు సీఎం రేవంత్ పూజలు చేయనున్నారు. స్వాతంత్యద్రినోత్సవం రోజు గోల్కొండ కోటలో సీఎం రేవంత్ జెండా ఎగరేశాక హెలికాప్టర్ ద్వారా నేరుగా ఖమ్మం జిల్లా వైరాకు చేరుకోనున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్‌లను ప్రారంభించిన అనంతరం అక్కడే భోజనాలు చేసుకుని వైరాలో జరుగనున్న భారీ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించనున్నారు. అక్కడే తుదివిడత రుణమాఫీని కూడా ప్రారరంభించే అవకాశం ఉంది. సీఎం రేవంత్ పర్యటన ఏర్పాట్లను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసే సీతారామ ప్రాజెక్ట్ తన రాజకీయ జీవిత సంకల్పమన్నారు. వైరా రైతు రుణమాఫీ సభ చరిత్రలో నిలుస్తుందని పేర్కొన్నారు. ఆగస్ట్ 15న వైరాలో సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభ విజయవంతం చేయాలన్నారు. రైతాంగం తలరాత మార్చే సభగా వైరా సభ నిలవనుందని చెప్పుకొచ్చారు. సీఎం సహకారంతో ఖమ్మంని అభివృద్ధి చేస్తానన్నారు.11న పుసుగూడెం, కమలాపురం పంపుహౌస్?ల వద్ద మంత్రులు పర్యటించారు. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సీతారామ ప్రాజెక్టు పంప్ హౌస్-2 ట్రయల్ రన్‌ను మంత్రులు ప్రారంభించారు. అలాగే ఆగష్టు 15న రాష్ట్రంలో రైతులు రుణ విముక్తి కానున్నారు. సీతారమ ప్రాజెక్ట్ ప్రారంభం అనంతరం వైరా బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2 లక్షల రుణాలను మాఫీ

వివరాలు 2లో

## కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి గృహ జ్యోతి పథకం వర్తింప చేయండి : భట్టి విక్రమార్క



**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు14:** విద్యుత్ ఉత్పత్తి విషయంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. మహాత్మ జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో ట్రాన్స్ కో, జెన్ కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అధికారులతో ఉప ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జెన్ కో నిర్వహించే విద్యుత్తు ఉత్పత్తి రంగ సంస్థల్లో ఏర్పడే

వివరాలు 2లో

# నాగార్జున సాగర్ డ్యామ్ రెండుగేట్ల ఎత్తివేత



**తొలి అక్షరం/నల్గొండ,ఆగస్టు14:** జిల్లాలోని నాగార్జున సాగర్ నిండుకుండను తలపిస్తున్నది. ఇటీవల భారీ వర్షాలకు ఎగువ నుంచి వచ్చిన భారీ వరదలతో ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తున్నది. ప్రస్తుతం సాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకున్నది. దీంతో అధికారులు రెండు క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా.. అదేస్థాయినీటిలో నీటిమట్టం ఉన్నది. ప్రస్తుత, పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.50 టీఎంసీలుగా ఉందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయానికి ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో 46,679 క్యూసెక్కులుగా ఉన్నది. ఇదిలా ఉండగా.. గత సోమవారం వరకు 18 సాగర్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదిలిన విషయం తెలిసిందే. ప్రవాహం తగ్గడంతో అధికారులు క్రస్ట్ గేట్లను మూసివేసి.. ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నింపారు. తాజాగా డ్యామ్ నీటిమట్టం గరిష్ఠానికి పైనుంచి వస్తున్న నీటిని.. అదే స్థాయిలో దిగువకు వదులుతున్నారు.

## సుంకిశాల ప్రాజెక్టు డైరెక్టర్ బదిలీ..

**- సర్కిల్-3 అధికారులపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు..!**



**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు14:** ఇటీవల నిర్మాణంలో సుంకిశాల ప్రాజెక్టు రిటైనింగ్ వాల్ కూలిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో అధికారులపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్‌పై సర్కారు బదిలీ వేటు వేసుంది. ఇక ప్రాజెక్టు కన్‌స్ట్రక్షన్ సర్కిల్–3 అధికారులైన సీజీఎం కిరణ్, జీఎం మరియరాజ్, డీజీఎం ప్రశాంత్, మేనేజర్ హరీశ్‌పై సస్పెన్షన్ విధించింది. ఈ మేరకు పురపాలకశాఖ కార్యదర్శి దాన కిశోర్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. సుంకిశాల ఘటనపై జలమండలి ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసి విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకున్న ప్రభుత్వం.. నిర్మాణ సంస్థకు సైతం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. హైదరాబాద్‌కు తాగునీరు అందించేందుకు నాగార్జున సాగర్ వద్ద పంప్‌హౌస్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. అయితే, సాగర్‌కు ఇటీవల భారీగా వరద వచ్చింది. దాంతో ఒక్కసారిగా పంప్‌హౌస్ రెండో టన్నెల్ నుంచి భారీగా నీరు రావడంతో ముందు భాగంలో నిర్మాణంలో ఉన్న గేటుతోపాటు రిటైనింగ్ వాల్‌లోని ప్యానెల్ కొట్టుకుపోయింది. అలాగే, పంప్‌హౌస్ అంతా నీటితో నిండింది. ఈ ఘటన జరిగిన సమయంలో కార్మికులు లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయ్యింది.

# నేడు సీతారామకు ప్రారంభోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

చేయనున్నారు. మూడో విడతగా లక్షన్నర నుంచి రెండు లక్షల వరకు రుణమాఫీ నిధులను వైరాలో సీఎం విడుదల చేనున్నారు. దాదాపు 14.45 లక్షల మందికి రుణమాఫీ అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. రుణమాఫీకి అర్హులైన ఖాతాలను మొత్తంగా 32.50 లక్షలు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు బడ్జెట్‌లో నిధులను కేటాయించింది. జులై 18న తొలి విడుతగా 11,4,412 మంది రైతులకు రూ.6034.97 కోట్ల నిధులను విడుదల చేసింది. తొలివిడతలో లక్ష వరకు రుణాలను ఏకకాలంలో మాఫీ అయ్యాయి. అలాగే జూలై 30 అసెంబ్లీ ప్రాంగణంలో రెండో విడత రుణమాఫీ నిధులను సర్కార్ విడుదల చేసింది. రెండో విడతలో లక్ష నుంచి లక్షన్నర వరకు ఉన్న రుణాలను మాఫీ చేసింది. 6,40,823 మంది రైతుల ఖాతాల్లో రూ.6190.01 కోట్లు జమ అయ్యాయి. అలాగే మూడో విడతలో లక్షన్నర నుంచి రెండున్నర లక్షల వరకు రుణాలను సర్కార్ మాఫీ చేయనుంది. ఈక్రమంలో సిఎం రేవంత్ పర్యటనకు భారీగా ఏర్పాట్లు చేశారు.



# కోల్‌కతాలో మహిళ వైద్యురాలి హత్యాచారంపై గాంధీ ఆసుపత్రిలో నిరసన చేపట్టిన డాక్టర్లకు సంఘీభావం ప్రకటించిన మంత్రి సీతక్క...

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు14:** కోల్కతా ఘటన దిగ్భ్రాంతికి గురిచేసిందిమహిళలపై అఘాయిత్యాలు నిలువరి ంచాలి మహిళా దేవతతో సమానంఇప్పుడిప్పుడే మహిళలు బయట కి వస్తున్నారుఇలాంటి ఘటనలు మహిళలను మధ్య యుగాలకు తీసుకు వెళ్తుందికలకత్తా లో వైద్యురాలిపై హత్యాచారం హేయం వైద్యులకు అండగా మేము నిలబడతాము తరగతి గదుల నుంచి మహిళలను గౌరవించాలి అని నేర్పిస్తాం తప్పు చేసిన వారు ఎవరైనా ఉపేక్షించకూడదుమహిళా రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత మహిళా



భద్రత పై ప్రతి ఒక్కరి ఆలోచన మారాలి.. అందుకోసం కృషి చేస్తాం.డ్రగ్స్ నియంత్రణకు మా ప్రభుత్వం కట్టుబడింది అలాగే మహిళా భద్రత పై కూడా పూర్తి స్థాయిలో కృషి చేస్తాం కఠినమైన చట్టాలను అమలు చేయడంతో పాటు ఇలాంటివి జరగ కుండా దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తాం సీఎం రేవంత్ రెడ్డి తో కలిసి మహిళా భద్రతకు కృషి చేస్తాంవైద్యుల భద్రత మనందరి బాధ్యత బాధితుల కుటుంబాలకు అన్నిరకాలుగా న్యాయం జరగాలిపని ప్రదేశాల్లో భద్రత చాలా ముఖ్యం.ప్రభుత్వాలు కృషి చేయాలి.

# హైదరాబాద్ చేరుకున్న సిఎం రేవంత్ బృందం

(మొదటి పేజీ తరువాయి)

11న దక్షిణ కొరియా లోని సియోల్ కి చేరుకున్నారు. దక్షిణ కొరియాలో రెండ్రోజుల పాటు రేవంత్ రెడ్డి పర్యటించారు. పెట్టుబడులే లక్ష్యంగా అమెరికా, దక్షిణ కొరియాలో పర్యటించారు. అక్కడ పలు కంపెనీలతో ఎంవోయూలు చేసుకున్నారు. అందులో భాగంగా కాగ్నిజెంట్‌తో చేసుకున్న ఒప్పందం మేరకు.. వచ్చి రాగానే కోకాపేటలో కొత్త క్యాంపస్‌కి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ నెల 5న తెలంగాణ సర్కార్‌తో కాగ్నిజెంట్ సంస్థ అమెరికాలో ఎంవోయూ చేసుకుంది. ఆ మేరకు 10 రోజుల్లోనే విస్తరణకు శ్రీకారం చుట్టారు. అమెరికా వేదికగా తెలంగాణను ఫ్యూచర్ స్టేట్‌గా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్ 4.0 సిటీగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకున్న వివిధ ప్రాజెక్టులకు భారీ స్పందన వచ్చింది. తెలంగాణను పెట్టుబడుల గమ్యస్థానంగా అమెరికా లోని పారిశ్రామికవేత్తల దృష్టిని ఆకర్షించారు. పర్యటనలో భాగంగా 50కి పైగా సమావేశాలు, 3 రౌండ్ టేబుల్ మీటింగ్‌లు నిర్వహించి పలు కంపెనీలను క్షేత్ర స్థాయిలో సీఎం రేవంత్ రెడ్డి సందర్శించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు వివిధ రంగాల్లో పేరొందిన భారీ కంపెనీలు ముందుకు వచ్చాయి. ఈ పర్యటనలో 31 వేల 532 కోట్ల రూపాయల పెట్టుబడుల కోసం 19 కంపెనీలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. దీంతో, రాష్ట్రంలో 30 వేల 750 కొత్త ఉద్యోగాలు లభించనున్నాయి. దక్షిణ కొరియాలో పలువురు పారిశ్రామికవేత్తలతో సీఎం రేవంత్ రెడ్డి చర్చలు జరిపారు. కొరియా బ్యూటీ ఇండస్ట్రీ ట్రేడ్ అసోసియేషన్‌తో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి, తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. శాంసంగ్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్, జీఎస్ క్లలెక్స్, సెల్ ట్రయాన్ కంపెనీ ప్రతినిధుల తోనూ సీఎం రేవంత్ రెడ్డి చర్చలు జరిపారు. హన్ రివర్ ప్రాజెక్టును సందర్శించి సియోల్ డిప్యూటీ మేయర్ తో భేటీ అయ్యారు. శామ్‌సంగ్ హెల్త్ కేర్ యూనిట్‌తో సమావేశమై చర్చలు జరిపారు. అలాగే కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీని సీఎం రేవంత్ రెడ్డి బృందం సందర్శించింది. కాల్ టెక్స్ కంపెనీ ప్రతినిధులతో పెట్టుబడులపై చర్చలు జరిపింది. ఇప్పటికే వరంగల్ టెక్స్‌టైల్స్ పార్కులో పెట్టుబడులు పెట్టేందుకు కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ సానుకూలంగా స్పందించింది.

# ఎమ్మెల్సీల నియామకానికి లైన్ క్లియర్

- **హైకోర్టు తీర్పుపై స్టే విధించిన సుప్రీం**
- **నియామకాన్ని అడ్డుకోలేమన్న సుప్రీం కోర్టు**



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఆగస్టు14:** తెలంగా ణలో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకానికి లైన్ క్లియరైంది. ఇప్పటికే కోదండరాం, అమీర్ అలీఖాన్ లను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేయాలని రాష్ట్ర కేబినెట్ గవర్నర్ కు సిఫార్స్ చేసింది. ఐతే కొత్త నియామకాలపై స్టే విధించాలని కోరుతూ బీఆర్‌ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ సుప్రీం కోర్టుకు వెళ్లారు. దీంతో గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బుధవారం సుప్రీం స్టే ఇచ్చింది. మరోవైపు కొత్త నియామకాలను చేపట్టకుండా ఆపాలన్న పిటిషనర్ల కోరికను సుప్రీం తిరస్కరించింది. గవర్నర్, ప్రభుత్వ హక్కులను హరించినట్లే అవుతుందని తెలిపింది. ఎప్పటికప్పుడు నియామకాలు చేపట్టడం ప్రభుత్వ విధి అని వ్యాఖ్యానించింది. ఎమ్మెల్సీల నియామకంపై గతంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించిండంతో కొత్త వారికి లైన్ క్లియర్ అయ్యింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు స్టే అమల్లో ఉంటుందని జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. తమ నియామకాన్ని పక్కన పెట్టి కొత్తగా ఎమ్మెల్సీలను గవర్నర్ కోటాలో ఎంపిక చేయడాన్ని సవాలు చేస్తూ భారాస నేతలు దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. కొత్తగా ఎమ్మెల్సీలను నియమించకుండా స్టే విధించాలని పిటిషనర్లు కోరగా.. ధర్మాసనం నిరాకరించింది. కొత్త ఎమ్మెల్సీల నియామకాన్ని అడ్డుకుంటే గవర్నర్, ప్రభుత్వ హక్కులు హరించినట్లు అవుతుందని వ్యాఖ్యానించింది. ఎప్పటికప్పుడు నియామకాలు చేపట్టడం ప్రభుత్వ విధి అని పేర్కొంది. అనంతరం పిటిషన్‌పై విచారణను ధర్మాసనం నాలుగు వారాల పాటు వాయిదా వేసింది. ప్రతివాదులుగా ఉన్న గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వానికి జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న బాలచంద్ర వరలే ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

# కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి గృహా జ్యోతి పథకం వర్తింప చేయండి : భట్టి విక్రమార్క

(మొదటి పేజీ తరువాయి)

సాంకేతిక సమస్యలను పరిష్కరించడానికి త్రిసభ్య కమిటీ వేయాలని సూచించారు. విద్యుత్ ఉత్పత్తి రంగ సంస్థల్లో ఏర్పడే సాంకేతిక సమస్యలను ఈ కమిటీ క్షేత్రస్థాయికి వెళ్లి అధ్యయనం చేసి పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి నివేదిక ఇవ్వాలని చెప్పారు. వారిచ్చిన నివేదిక ఆధారంగా జెన్ కో సీఎండీ నిర్ణయం తీసుకుని విద్యుత్తు ఉత్పత్తికి అంతరాయం రాకుండా చూడాల్సిందిగా ఆదేశించారు.భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ యూనిట్ –1లో జనరేటర్ ట్రాన్స్ ఫార్మర్ మరమ్మతులు చేయాలా? లేక కొత్తది కొనుగోలు చేయాలా? అనే అంశాన్ని టెక్నికల్ కమిటీకి పరిశీలిస్తోందని తెలిపారు. డిసెంబర్ 2023కు ముందు గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల అమలుకు సంబంధించి తప్పనిసరిగా ఈ ప్రభుత్వానికి నివేదించాలని ఈ సందర్భంగా అధికారులకు భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. నిర్ణయాలను అమలు చేసే సమయంలో సీఎండీలు తప్పనిసరిగా ఎనర్జీ సెక్రెటరీని సంప్రదించాలని సూచించారు. జల విద్యుత్ కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు ఎదురైతేవెంటనే తన దృష్టికి తీసుకురావాలని, ఇందులో ఎలాంటి ఆలసత్వం వహించవద్దని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం గురించి ఆరా తీశారు. గృహజ్యోతి పథకానికి అర్హులై ఉండి గతంలో దరఖాస్తు చేసుకోని వారికి తిరిగి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించి గృహ జ్యోతి పథకాన్ని వారికి వర్తింప చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో 227 సబ్ స్టేషన్ల నిర్మాణానికి ప్రక్రియ మొదలైందని చెప్పారు. అందులో 113 సబ్ స్టేషన్లకు స్థల సమస్య లేదని మిగతా వాటికి స్థలాలు కలెక్టర్లు కేటాయించాల్సి ఉందని చెప్పారు.కాళేశ్వరం, ఇతర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఎన్ని మెగావాట్ల విద్యుత్ ను ఉపయోగిస్తున్నారు? అందుకు ఎంత మేర ఖర్చు అవుతోందో మొత్తం వివరాలతో నివేదిక ఇవ్వాలని అధికారులకు స్పష్టంగా చెప్పారు. ఈ సమస్య సమావేశంలో ఎనర్జీ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ అలీ, ఎన్పీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, ట్రాన్స్ కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# కంపు కొడుతున్న పల్లెలు, పట్టణాలు

- **కాంగ్రెస్ పాలనలో పారిశుద్ధ్యం కొరవడింది**
- **నిధులు విడుదల లేక నీరసించిన గ్రామాలు**
- **మాజీమంత్రి కెటిఆర్ ఘాటు విమర్శలు**

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు14:** కాంగ్రెస్ పాలనలో.. పల్లెలు, పట్టణాలు కంపు కొడుతున్నాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఓవైపు తెలంగాణ పల్లెల్లో పాలన పూర్తిగా పడకేసింది.. మరోవైపు పట్టణాల్లో పరిస్థితి అధ్వాన్నంగా మారింది.. ప్రజా పాలన అంటే ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనా..? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. అటు కేంద్రం నుంచి, ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోవడంతో పంచాయతీలు తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడు తున్నాయి. పాత పనులకు ఎనిమిది నెలలైనా బిల్లులు చెల్లించకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకు పోయిన తాజా మాజీ సర్పంచ్‌ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పారిశుధ్యం, డ్రైనేజీ నిర్వహణ అధ్వాన్నంగా మారడంతో.. ప్లలెల్లో ప్రజల జీవనం దినదిన గండంలా మారింది. దోమల మందుకు కూడా నిధులు లేకపోవడంతో పంచాయతీల్లో డెంగ్యూ, మలేరియా విజృంభిస్తున్నాయి. పంచాయతీలకు నిధులివ్వకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనా.. మీ ప్రజాపాలన అంటే.. ?? అని కేటీఆర్ నిలదీశారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రతి నెలా పంచాయితీలకు ఠంచన్‌గా రూ.275 కోట్లు విడుదల చేశాం. నేడు.. పెండింగ్ బిల్లులు చెల్లించాలని అడిగిన పాపానికి 1800 మాజీ సర్పంచ్‌లపై నిర్బంధాలు.. అక్రమ అరెస్టులు. 15వ ఆర్థిక సంఘం నుంచి అందిన రూ.500 కోట్ల నిధులను గ్రామపంచాయతీలకు ఇంకెప్పుడు ఇస్తారు..? ఉపాధి హామీ పథకం, హెల్త్ మిషన్ నుంచి వచ్చిన రూ.2100 కోట్ల కేంద్ర నిధులను ఎందుకు దారి మళ్లించారు.. 12,769 పంచాయితీల్లో పేరుకుపోయిన విద్యుత్ బకాయిలే రూ.4305 కోట్లని అంచనా. వాటి పరిస్థితి ఏంటని కేటీఆర్ ప్రశ్నించారు. దేశానికే పట్టుగొమ్మలుగా భావించే పల్లెలపై కాంగ్రెస్ పాలనలో ఎందుకింత నిర్లక్ష్యం.. కాంగ్రెస్ పాలనలో.. ప్లలెల్లో పాలన పూర్తిగా పడకేస్తే.. ఇక పట్టణాలు పెను సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. గ్రేటర్ తోపాటు.. రాష్ట్రంలోని 12 కార్పొరేషన్లు, 129 మున్సిపాలిటీల్లో కనీసం కార్మికులకు వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి. రాష్ట్ర బ్జడెట్ లో జీహెచ్‌ఎంసీకి అరకొర నిధులు కేటాయించడంతో.. మహానగరంలో అభివృద్ధి పనులు పూర్తిగా మూలనపడిన మాట వాస్తవం కాదా.. కాంగ్రెస్ చెప్పుకునే ప్రజాపాలనలో.. పల్లె ప్రగతికి పాతరేసి.. పట్టణ ప్రగతిని అడ్రస్ లేకుండా చేసిన మాట నిజం కాదా.. అని కేటీఆర్ అడిగారు. ÷ఎన్సిపాలిటీల్లో పెండింగ్ పనులకు మోక్షం లేదు.. కొత్త పనులకు ప్రణాళిక లేదు. నిధులు లేక పూర్తిగా నీరసించిన మున్సిపాలిటీల్లో కనీసం అత్యవసర మరమ్మత్తులకు కూడా పైసలు లేకపోవడం దుర్మార్గం కాదా..? వర్షాకాలంలో అధ్వాన్నంగా మారిన రోడ్లతో ప్రతినిత్యం అవస్థలు పడుతున్న ప్రజలకు ఏం సమాధానం చెబుతారు..? మున్సిపాలిటీల్లో రూ.1200 కోట్లకుపైగా ఉన్న పెండింగ్ బిల్లులను ఇంకెప్పుడు విడుదల చేస్తారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రే స్వయంగా పర్యవేక్షిస్తున్న మున్సిపల్ శాఖకే ఈస్థాయిలో నిధుల కొరత ఉంటే.. ఇక ఇతర శాఖల దుస్థితి ఏమిటి..? అని కేటీఆర్ మండిపడ్డారు. ఆగష్టు 15 లోపు బకాయిలు చెల్లించకపోతే ఆందోళనకు సిద్ధమవుతున్న మున్సిపల్ కాంట్రాక్టర్ల కష్టాలను తీర్చే తీరిక ఈ ప్రభుత్వానికి ఉందా..? కనీసం కార్మికులకు వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి నుంచి పురపాలక శాఖను ఇప్పటికైనా గ్టటెక్కించే ధైర్యం ఉందా..? మున్సిపాలిటీల్లో దెబ్బతిన్న రోడ్లు, పొంగిపొర్లుతున్న డ్రైనేజీల మరమ్మత్తులను యుద్ధప్రాతిపదికన చేపట్టే ఆలోచన ఉందా..? బీఆర్‌ఎస్ హయాంలో పదేళ్లు పచ్చగా కళకళలాడిన ప్లలెలు, ప్రగతిపథంలో దూసుకుపోయిన పట్టణాలు.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సంక్షోభంలో కొట్టుమిట్టాడటం మీ అసమర్థతకు, పాలనా వైఫల్యాలకు నిలువెత్తు నిదర్శనం.. మీ చేతకానితనాన్ని తెలంగాణ సమాజం గమనిస్తోందనే విషయాన్ని మరిచిపోకండి అని కేటీఆర్ పేర్కొన్నారు.



# అలసత్వం వహించిన అధికారులపై వేటు తప్పదు

- అధికారులు..ప్రజల కోసం పని చేయండి
- ప్రజల సమస్య తో వస్తే వెంటనే స్పందిచి పరిష్కారం చేయాలి
- ప్రజాసమస్యలపై దృష్టి సారించండి
- ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్





తొలి అక్షరం/నెల్లికుదురు,ఆగస్టు14: విధులపట్ల,ప్రజా సమస్యలపై అలసత్వం వహించిన అధికారులపై వేటు తప్పదని ఎమ్మెల్యే డాక్టర్ మురళినాయక్ హెచ్చరించారు.బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన అధికారుల సమీక్ష సమావేశం మండల అభివృద్ధి అధికారి బాలరాజు అధ్యక్షతన నిర్వహించగా ఈ సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.... ప్రజల సంక్షేమం కోసం ఏర్పడ్డ ప్రజా పాలన ప్రభుత్వమని అన్నారు.సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని లేనియెడల అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మండలంలో విద్యుత్తు సమస్యపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు దృష్టి సారించాలన్నారు.విద్యార్థుల విషయంలో స్కూల్ యాజమాన్యం,ఉపాధ్యాయులు ఆజాగ్రత్త వహించొద్దని సూచించారు.ప్రతి గ్రామంలో డ్రాఫ్ ఔట్ లేకుండా స్థానిక పంచాయతీ కార్యదర్శి చర్యలు తీసుకోవాలన్నారు.వన మహోత్సవ కార్యక్రమంలో నాటిన ప్రతి మొక్క బ్రతకల్సిందేనని గ్రామ స్థాయి అధికారులు ప్రతి ఒక్క ఇంటికి ఒక మొక్కను నాటే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.ప్రజా ప్రభుత్వంలో అధికారుల తీరుపై ప్రభుత్వానికి ఎలాంటి చెడ్డ పేరు వచ్చిన ఉపేక్షించేది లేదని వారిపైన కఠిన చర్యలు ఉంటాయని మందలించారు.ముఖ్యంగా ఈ వర్షాకాలంలో విద్యుత్ విషయంలో గాని వైద్యం విషయంలో గాని నిత్యం ప్రజలతో మమేకమై ఉండి పనిచేయాలని వారి స్థితిగతులను నిత్యం పర్యవేక్షించాలని అన్నారు.వారికి ఎలాంటి సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించే విధంగా చర్యలు చేపట్టాలని విద్యుత్ అధికారులకు వైద్య సిబ్బందికి అధికారులకు సూచించారు.ఏ అధికారి మీద ప్రజల నుండి కంప్లైంట్ వచ్చిన ఉపేక్షించబోనని వారిపైన తగు చర్యలు వెంటనే ఉంటాయన్నారు.ఉద్యోగులకు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు.ప్రతినెల రివ్యూ మీటింగ్ ను మండల కేంద్రాల్లో నిర్వహిస్తానన్నారు.నిత్యం ప్రజలకు అందుబాటులోనే ఉండాలన్నారు.విధులకు రాకుండా ఇంటి దగ్గర ఉండి స్థాయి ఉద్యోగులతో పని చేపిస్తమంటే వారి పైన వేటు తప్పదన్నారు.ఈ కార్యక్రమం అనంతరం అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజలు ఏ సమస్య పైన అయినా సరే ఫోన్ చేస్తే వెంటనే స్పందించాలని ఆ పనిని వెంటనే జరిగేలా చొరువచూపాలని అధికారులకు హెచ్చరించారు.ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా సరే అధికారులను వెంటనే స్పందించాలన్నారు.లేని యెడల ఉపేక్షించేది లేదని వారిపైన కచ్చితంగా చర్యలు ఉంటాయని గట్టిగా హెచ్చరించారు.ప్రభుత్వం చేపడుతున్న ప్రజా కార్యక్రమాలు ప్రజలకు అందే విధంగా అహర్నిశలు అధికారులు కృషిచేసి పని చేయాలన్నారు.లేనిచో వారిపైన కఠిన చర్యలు ఉంటాయని కచ్చితంగా అధికారులు ప్రజల పక్షాన నిత్యం పనిచేయాలన్నారు.వారి నుండి ఎలాంటి పిర్యాదులు తన దరికి రాకుండా అధికారులు సక్రమంగా పనిచేయాలన్నారు.వన మహోత్సవ కార్యక్రమంలో నాటిన ప్రతి ఒక్క మొక్క బ్రతకాల్సిందే ఏదో ఫోటోలకు ఫోజులిచ్చే కార్యక్రమాలను మానుకోవాలన్నారు.ప్రతి ఊరిలో ప్రతి ఇంటికి ఒక మొక్క నాటే విదంగా చర్యలు చేపట్టాలని గ్రామ స్థాయి అధికారులకు సూచించారు.తహసీల్దార్ కొడిచింతల రాజు ఎంపిఓ పద్మ వివిధ శాఖ అధికారులు పాల్గొనగా తొలుత ఫీల్డ్ అసిస్టెంట్ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.

## దేశ భక్తిని పెంపొందించుకోవాలి

- జిల్లా కార్యవర్గ సభ్యులు చందు రాజ్ కుమార్






తొలి అక్షరం/నెల్లికుదురు,ఆగస్టు14: ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని జిల్లా కార్యవర్గ సభ్యులు చందు రాజ్ కుమార్ కోరారు.బుధవారం మండల కేంద్రంలోబీజేవైఎం ఆధ్వర్యంలో హర ఘర్ ఫిరంగి కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రతి భారతీయుడు దేశభక్తి భావం కలిగి వుండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజేపీపి మండల అద్యక్షులు భవాని ప్రసాద్,బిజేవైఎమ్ మండల అధ్యక్షులు మాధవత్ సురేష్,మండల ప్రధాన కార్యదర్శి పెరుమాండ్ల శివ సాయి గౌడ్,తోట సురేష్,తోట రమేష్,రాజా గౌడు,చట్ల సంతోష్,నిమ్మ కంటి యాకన్న,వంగాల రామచందర్, తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

- నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఎం.సురేష్




తొలి అక్షరం/నర్సింహులపేట,ఆగస్టు14: నర్సింహులపేట ఎస్సైగా ఎం సురేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు నరసింహుల పేట ఎస్సైగా సతీష్.పనిచేస్తున్న కొరివి ఎస్సైగా బదిలీ అయ్యారు. నూతన ఎస్సై ఎం సురేష్ సిబ్బందితో సమావేశమై మండల పరిస్థితిలో అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మండలంలో ఎంతటి వారైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండలంలో శాంతి భద్రతలను పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అనంతరం నూతన ఎస్సై మండల కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసుకున్నారు.ఆలయ సిబ్బంది నూతన ఎస్సై కి ఘనంగాసాల్వతో సత్కరించారు.

## సీఎం రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలి

- జిల్లా కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్

తొలి అక్షరం/తిరుమలాయపాలెం,ఆగస్టు14: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ నుముల రేవంత్ రెడ్డి ఆగస్టు 15న గురువారం వైరా నియోజకవర్గంలో కొత్త గూడెం భద్రాద్రి జిల్లాలో నిర్వహించిన పర్యటనను విజయ వంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్ పిలుపునిచ్చారు. బుధవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ఆగస్టు 15తేదీన ముందుగా గోదావరి సీతారాం ప్రాజెక్టు ప్రారంభోత్సవం జరుగుతుందని తర్వాత వైరాలో బహిరంగ సభ జరుగుతుందని అక్కడ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు రెండు లక్షల రుణమాఫీ విడుదల చేస్తారని తెలిపారు.ఈ బహిరంగ సభలో రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,రాష్ట్ర రెవె న్యూ గృహ నిర్మాణ పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు పొం గులేటి శ్రీనివాస్ రెడ్డి,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి,రాజ్యసభ సభ్యురాలు గారపాటి రేణుక చౌదరి, మంత్రులు ఎమ్మెల్యేలు కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొంటారని ఈ బహిరంగ సభకు ప్రజలందరూ భారీగా తరలి వచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కొప్పుల అశోక్,మండల కాంగ్రెస్ నాయకులు సామ శ్రీనివాస్ రెడ్డి,పెరుమళ్ళపల్లి బాలస్వామి,మీసాల వెంకటేశ్వర్లు, చలమల నర్సిరెడ్డి,ఉండేటి ప్రకాష్,దోమల రమేష్, ఉబ్బని కార్తీక్,కొప్పుల రాజేష్,పదముత్తు కనకరాజు, పూజా వెంకట రత్నం,ఏగూరి దాసు,తుమాటి అజ్రయ్య, ఉండేటి ధర్మరాజు, నూక తొట్టి సాల్మన్,పదముత్తు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# మాలలు మరో పోరాటానికి సన్నద్ధమై ఉద్యమించాలి

- హైకోర్టు న్యాయవాది పల్లా రాజశేఖర్






తొలి అక్షరం/తిరుమలాయపాలెం,ఆగస్టు14: మాలలందరూ ఐక్యంగా మరో పోరాటానికి సన్నద్ధం కావాలని ప్రముఖ హైకోర్టు న్యాయవాది పల్లా రాజశేఖర్ తెలిపారు.బుధవారం మండల కేంద్రంలో మాల మహానాడు మండల మహాసభ కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఈ మహాసభలలో మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్,జిల్లా సీనియర్ నాయకులు మందడి ఇజ్రాయిల్,ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ మోటపోతుల బాబురావు,మాల మానాడు ఖమ్మం జిల్లా అధ్యక్షా కార్యదర్శులు కొట్టే సుధాకర్,గుమ్మడి కనకరాజు,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టు వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శి జమ్మి వీరబాబు తదితరులు పాల్గొని ప్రసంగించారు.ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నటువంటి పల్లా రాజశేఖర్ మాట్లాడుతూ.. భారత సమాజంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పాలక ప్రజా ప్రతినిధులు మాలలను టార్గెట్ చేసి సమాజిక ఆర్థిక రాజకీయ రంగాలలో దెబ్బతీయాలని కుట్ర చేస్తున్నారు.అధికారంలోకి రానటువంటి రాజకీయ పార్టీలు కూడా మాలల పైన వివక్షత చూపుతున్నారని 341 ఆర్టికల్ ప్రకారంగా షెడ్యూల్ కులాల అందర్నీ విభజించి పాలించాలనే విధానంగా కనబడని కుట్ర చేస్తున్నారన్నారు.దీన్ని అధిగమించాలంటే ఎదుర్కోవాలంటే ఈ రాష్ట్రంలో ఉండబడినటువంటి మాల సామాజం ఏకతాటి పైకి రావాలని పిలుపునిచ్చారు.కొప్పుల అశోక్ మాట్లాడుతూ... నూతనంగా వేయబడిన మండల కమిటీ ప్రతి మాలపల్లిను తట్టి మొన్న సుప్రీంకోర్టు వర్గీకరణ తీర్పు వలన జరిగే నష్టాలు ప్రతి మాల కుటుంబ సభ్యులకి తెలియాలని అందుకు పని కట్టుకొని ప్రతి పల్లె తట్టాలని పిలుపునిచ్చారు.మందడి ఇజ్రాయిల్ మాట్లాడుతూ...సమాజంలో ఉండబడిన వర్గాలు మొత్తం ఒకవైపు అయినాయని మాల సామాజిక వర్గం ఒకటే ఒక వైపు నిలిచిందని దీన్ని గమనించాల్సిన అవసరం ప్రతి సభ్యునికి ఉందని లేనియెడల భవిష్యత్తులో జరగబోయే ప్రమాదాలను ఎదురు కావాలంటే కష్టంగా ఉంటది అని తెలియజేసినారు. సీనియర్ జర్నలిస్టు మాటపోతుల బాబురావు మాట్లాడుతూ..ఈ సమాజంలో ఉండబడినటువంటి మాలలు ఏ రంగంలో ఉన్న వారందరు మాల సమాజం వైపు దృష్టి పెట్టాలని నేడు మాలలు నిండు ప్రమాదంలో ఉన్నారని ఎలాంటి రాజకీయ అండదండలు కూడా లేవని అన్ని కూడా వన్ సైడ్ అయిపోయాయని మాలలు ఒక్కరే ఒక్కరిగా మిగిలారని దీన్ని అధిగమించుటకు అందరూ సహాయ సహకారాలు అందించి అండదండలుగా ఉండాలని బలమైన ఉద్యమాలు నిర్మించాలని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది.మాల మాహనాడు ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కొట్టే సుధాకర్ మాట్లాడుతూ...మాకు ఉండబడిన బాధ్యతలను నిరంతరం అలుపెరగకుండా ప్రజలను సమీకరించే విధంగా పనిచేస్తామని దీనికి అందరూ తోడ్పాటు అవసరమా అని పేర్కొన్నారు.జిల్లా కార్యదర్శి గుమ్మడి కనకరాజు మాట్లాడుతూ.... వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల సమాజం ముందుకు రావాలని అందుకు మండల గ్రామస్థాయిల వరకు కమిటీలు వేసి సంఘటితం చేయాలని ప్రతి మండల సెంటర్లో మాస్ ర్యాలీలు తీయాలని పేర్కొన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ప్రతి గ్రామంలో సమావేశాలు జనరల్ బాడీ లు నిర్వహించి మాలలపై జరుగుతున్న భౌతిక దాడిని వివరిస్తూ సమన్వయం చేస్తూ ఉద్యమాలు నిర్మించాలని పేర్కొన్నారు.ప్రచార కార్యదర్శి జమ్మి వీరబాబు మాట్లాడుతూ....జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో మండల కమిటీలు వేసి బలమైన సంఘంగా నిర్మాణం చేయాలని అప్పుడే మన మీద జరుగుతున్న దాడులు ఎదుర్కోవటానికి సాధ్యమైతుందన్నారు.అనంతరం మహా సభకు వచ్చినటువంటి ప్రతినిధులతొ మండల నూతన కమిటీని వేయడం జరిగింది.మండల అధ్యక్షులుగా పప్పుల ప్రసాద్ ప్రధాన కార్యదర్శిగా కాశీ మల్ల మహేందర్ బాబు ఉపాధ్యక్షులుగా దామల అశోక్ దోమల సుధాకర్ ఉండేటి ధర్మరాజు సహాయ కార్యదర్శిగా మెట్టు మధు దామల్ల భాస్కర్ బోలెద్దూ మధు కోశాధికారిగా దోమల రమేష్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా పల్లి వినోద్,ప్రచార కార్యదర్శిగా వై శ్రీరాములు కార్యవర్గ సభ్యులుగా గుంతటి ప్రభాకర్ పల్లి భాస్కర్ ఉబ్బన ప్రసన్న తూమాటి భాస్కర్ గాదరి బాబు గండమల్ల ఉపేందర్ మాట మరి లింగయ్య పల్లి ఉపేందర్ లతోపాటు మరికొందరిని తీసుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండలంలో ఉండబడినటువంటి 10 గ్రామాల మాల మానాడు నాయకులు పాల్గొని తిరుమలాయపాలెం మండల మహాసభను జయప్రదం చేయడం జరిగింది.

# ఘనంగా వైభవంగా బోనాల ఉత్సవాలు





తొలి అక్షరం/నర్సింహులపేట,ఆగస్టు14: నర్సింహులపేట మండల కేంద్రంలో పాటు రామన్నగూడెం, జయపురం, కొమ్ములవంచ,పెద్దనాగారం,పడమటి గూడెం తోపాటుగ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు.మండల కేంద్రంలో ముత్యాలమ్మ దేవాలయం ను సందర్శించి భక్తి శ్రద్ధలతో మొక్కలు చెల్లించారు.స్థానిక తహసిల్దార్ నాగరాజు,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రమేష్,గ్రామ పార్టీ అధ్యక్షుడు రామకృష్ణ,వెన్నం రవీందర్ రెడ్డి,కాంగ్రెస్ కార్యకర్తలు, అమ్మవారి దర్శనం చేసుకున్నారు.అనంతరం మండల కేంద్రంలో ముత్యాలమ్మ బోనాల సందర్భంగా మహిళలు భారీ ఎత్తున అమ్మవారికి కుంకుమ పసుపు పలు రకాల స్వీట్లు అమ్మవారికి సీరియల్ సమ ర్పించుకొని చల్లంగా చూడాలని పాడిపంటలు చల్లంగా ఉండి ఈ సంవత్సరం కాలం మంచిగా కావాలని వర్షాలు కురవాలని అమ్మవారి దర్శనము పెద్ద ఎత్తున మహిళలు. మరి పేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజశేఖర్,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రధాన కార్యదర్శి ఏరా నాగి రమేష్,వెంకన్న,రేఖ అనిల్,వేముల రంగన్న, వేముల రాంరెడ్డి,డాక్టర్ వీరారెడ్డి కాషా యాకయ్య, ఎండి మున్వర్,గౌని యాదగిరి,దోమల యాదగిరి, ఆయా స్థానిక నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.అనంతరం బోనాల పండుగ సందర్భంగా అలాంటి సంఘటనలు జరగ కుండా ఎస్సై ఎం సురేష్ పోలీస్ బందోబస్తుగా నిర్వహించారు.

# ఒప్పందాల పర్యవేక్షణకు ఇన్వెస్టర్స్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు

**- పదేండ్లలో 1ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ - ప్రపంచంతోనే పోటీ పడతాం.. పక్క రాష్ట్రాలతో కాదు - కాగ్నిజెంట్ కొత్త క్యాంపస్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి**



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),ఆగస్టు14:** అంతర్జాతీయ,జాతీయ స్థాయి కంపెనీలతో చేసుకునే ఒప్పందాలు ఎప్పటికప్పుడే కార్యరూపందాల్చేలా కొత్తగా తెలంగాణ ఇన్వెస్టర్స్ టాస్క్ ఫోర్స్ వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు.టెక్నాలజీ,స్కిల్స్,ఫార్మా,లైఫ్ సైన్సెస్ తదితర రంగాల్లో అపారమైన అవకాశాలున్న తెలంగాణలో పెట్టుబడుల భద్రతకు ప్రభుత్వమే భరోసా ఇస్తుందని చెప్పారు.రాబోయే పదేండ్లలో తెలంగాణను 1ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇందుకోసం తెలంగాణ ది ఫ్యూచర్ స్టేట్ నినాదంతో ప్రజాప్రభుత్వం పకడ్బందీగా ప్రణాళికలను అమలుచేస్తున్నట్లు తెలిపారు.ఆర్థికాభివృద్ధిలో తెలంగాణ ప్రపంచంతోనే పోటీపడుతుంది కానీ పక్క రాష్ట్రాలతో కాదని సీఎం అన్నారు.హైదరాబాద్, సికింద్రాబాద్,సైబరాబాద్ తర్వాత నాలుగో నగరమైన ఫ్యూచర్ సిటీని ప్రపంచ అవసరాలు తీర్చగలిగేలా 'చైనా వన్ ప్లస్ కంట్రీ' స్థాయిలో ఉంటుందని చెప్పారు.దిగ్గజ ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ కోకాపేటలో నూతనంగా ఏర్పాటుచేసిన క్యాంపస్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.పరిశ్రమలు,ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,ఉన్నతాధికారులు,కాగ్నిజెంట్ ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.కొత్త క్యాంపస్ ఏర్పాటుతో కాగ్నిజెంట్ సంస్థకు దేశంలోనే హైదరాబాద్ అతిపెద్ద కేంద్రంగా మారిందని,ప్రస్తుతం సుమారు 65వేల మంది ఉద్యోగాలు చేస్తున్నారని,తద్వారా తెలంగాణలో ఉద్యోగాలు కల్పించే రెండో అతిపెద్ద సంస్థగా కాగ్నిజెంట్ ఎదగడం గొప్ప విషయమని ముఖ్యమంత్రి అభినందించారు.దావోస్ పర్యటనలో అంగీకారం కుదిరితే,కేవలం ఆరు నెలల వ్యవధిలోనే కాగ్నిజెంట్ వారు హైదరాబాద్ లో నూతన క్యాంపస్ ఏర్పాటు చేయడం రికార్డు అని సీఎం అభినందించారు.శతాబ్దాల మనగడలో హైదరాబాద్ నేడు విశ్వనగరంగా ఎదిగిందని,దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ మద్దతుతో ఉమ్మడి రాష్ట్రంలో నాటి సీఎం నేదురుమల్లి ఐటీ పార్కుకు శంకుస్థాపన చేసిన నేపథ్యమే హైదరాబాద్ ను ఐటీలో మేటిగా నిలబెట్టిందని ముఖ్యమంత్రి గుర్తుచేశారు.ఉమ్మడి రాష్ట్రంలోగానీ,తెలంగాణ ఏర్పాటు తర్వాతగానీ పాలకులు హైదరాబాద్ విషయంలో రాజకీయ భేదాభిప్రాయాలను పక్కనపెట్టారని,ప్రస్తుత ప్రపంచ అవసరాల దృష్ట్యా తాము నిర్మిస్తోన్న ఫ్యూచర్ సిటీ హైదరాబాద్ అభివృద్ధిని మరో స్థాయికి తీసుకెళుతుందని సీఎం తెలిపారు.పెట్టుబడుల సాధన కోసం ఇటీవల చేపట్టిన అమెరికా,దక్షిణ కొరియా పర్యటనలు విజయవంతం అయ్యాయని,ఒక్క అమెరికాలోనే సుమారు 31వేల కోట్ల రూపాయల పెట్టుబడులు రాబట్టగలిగామని, తద్వారా దాదాపు 30వేల ఉద్యోగాలు వస్తాయని ముఖ్యమంత్రి తెలిపారు.రాబోయే రోజుల్లో కూడా పెట్టుబడులు,ఒప్పందాల ప్రక్రియ కొనసాగుతుందని సీఎం అన్నారు.తెలంగాణకు మొత్తం మూడు వలయాలు ఉంటాయని, కోర్ అర్బన్ హైదరాబాద్ మొదటి వలయమైతే,రీజనల్ రింగ్ రోడ్డు వరకు ఉండే రెండోదైన సెమీ అర్బన్ వలయంలో మాన్యుఫ్యాక్చరింగ్ హబ్స్, ఫ్యూచర్ సిటీ ఉంటాయని,ఇక మూడో వలయమైన రూరల్ తెలంగాణలోని గ్రామాలను ఆసియాలోనే ఉత్తమ గ్రామాలుగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ప్రపంచ అవసరాలకు అనుగుణంగా తెలంగాణ ఐటీ రంగాన్ని కొత్తపుంతలు తొక్కిస్తున్నట్లు చెప్పారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ని అన్నింటితో అనుసంధానం చేయాలని ముఖ్యమంత్రి గారు భావిస్తున్నారని ఐటీ మంత్రి తెలిపారు.తెలంగాణ యువతలో నైపుణ్యాలు పెంచి గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతోనే ప్రజాప్రభుత్వం సరికొత్తగా ఏఐ సిటీని నిర్మిస్తోందని, సెప్టెంబర్ లో ప్రతిష్టాత్మక ఏఐ గ్లోబల్ సదస్సును కూడా నిర్వహిస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు.

## అంగరంగ వైభవంగా ముత్యాలమ్మ తల్లి పూజలు

**- విశ్వబ్రాహ్మణులతో మొదలైన ముత్యాలమ్మ తల్లి బోనాలు**



**తొలి అక్షరం/పెద్దవంగర,ఆగస్టు14:** మండల కేంద్రంలోని వడ్డేకొత్తపల్లి గ్రామంలో అంగరంగ వైభవంగా ముత్యాలమ్మ తల్లి బోనాలు పూజలు ముందుగా గ్రామంలో ముత్యాలమ్మ తల్లి బోనాలు గ్రామ దేవత అయిన ముత్యాలమ్మ తల్లి పూజలకు ప్రతి ఏట మొక్కుబడిగా పూజలు అందుకుంటున్న తల్లి ముత్యాలమ్మ గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో పిల్లాపాపలతో పాడిపంటలు చల్లగా ఉండాలని కోరుకుంటూ విశ్వ బ్రాహ్మణులు మొదటిగా బోనాలు తీసుకొచ్చి అమ్మవారికి పూజలు చేసి నైవేద్యాలు పెట్టి పోతరాజుకి గొర్లు మేకలు,కోడిపుంజుల తో బలి ఇవ్వడం జరుగుతుంది ఆ తర్వాత గ్రామ ప్రజలందరూ అదేవిధంగా అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని గ్రామ దేవతను వేడుకుంటున్నారు ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణులు శేఖరా చారి మల్లికార్జున చారి. రమేష్ చారి.గ్రామ ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా లింగగిరి పోచమ్మ బోనాల పండగ



**తొలి అక్షరం/చెన్నారావుపేట,ఆగస్టు14:** చెన్నారావుపేట మండల పరిధిలోని లింగగిరి గ్రామంలో పోచమ్మ బోనాలు శోభాయం మనంగా ఘనంగా నిర్వహించడం జరిగింది.శివాలు ఊగే శివసత్తులు గ్రామ ప్రజలంత బోనాల పండుగను సాంప్రదాయాలతో భక్తిశ్రద్ధలతో నాటు కోళ్లతో,పోచమ్మ తల్లిని దర్శించుకోవడం జరిగింది.అదే విధంగా సంవత్సరానికి ఒకసారి శ్రావణమాసంలో వచ్చే బోనాల పండుగను తెలంగాణలోని ప్రతి గ్రామీణ ప్రాంతాలలో బోనాల పండుగను ఘనంగానిర్వహించడం జరిగింది.అనాదిగా తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే విధంగా ఈ సంవత్సరం కూడా అదే విధంగా శివ సద్దులు బోనాలతో పోతు రాజుల తో బోనాల పండుగను ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో లింగగిరి గ్రామ ప్రజలు శివ సత్తులు గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రముఖులు అంతా కలిసి ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని అంతటినీ గ్రామ పంచాయతీ సిబ్బంది కారోబార్ దాసరి రమేష్ ఆధ్వర్యంలో శోభాయమానంగా గ్రామపంచాయతీ సిబ్బంది మాదారపు స్వామి,పసునూరి చిరంజీవి,దాసరి అశోక్ వివిధ కుల సంఘాల పెద్ద మను షులతొ కలిసి ఘనంగా బోనాల పండుగ నిర్వహించడం జరిగింది.

## కుంభం కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

**తొలి అక్షరం/నర్సింహులపేట,ఆగస్టు14:** నర్సింహులపేట మండలం లోని వంతడపల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కుంభం సుదీర్ రెడ్డి తండ్రి విశ్రాంత ఉపాధ్యాయుడు భద్రారెడ్డి అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న డోర్నకల్ బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.ఆపద సమయంలో అండగా ఉంటామని అన్నారు.ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు మైదం దేవేందర్,మాజీ సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు కాలసాని దామోదర్ రెడ్డి,జయపురం నెలకుర్తి సత్తిరెడ్డి,నర్సింహులపేట పట్టణ అధ్యక్షుడు కొండబత్తిని జగదీశ్వర్,కొమ్మలమంచ పార్టీ అధ్యక్షుడు రామన్న పటేల్, జయపురం గ్రామ మాజీ సర్పంచ్ మందుల యాకన్న,కసిరెడ్డి లింగారెడ్డి తదితరులు ఉన్నారు.



## ఆర్థిక సహాయాన్ని అందించిన తోటి పూర్వ విద్యార్థులు



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో (సాంబ), ఆగస్టు14:** మండల కేంద్రంలోని సూరిపల్లి గ్రామానికి చెందిన కొలిపాక స్వప్న తండ్రి కొలిపాక సంజీవ అకాల మర ణం తో స్నేహితురాలికి వారి కుటుంబాన్ని బాల్య మిత్రులు వారి కుటుంబాన్ని పరామర్శించి వారి సానుభూతిని తెలియ జేయడంతో పాటు అండగాపూర్వ విద్యా ర్థులు అందరూ కలిసి 5000 రూపా యలు ఆర్థిక సాయం చేశారు.ఈ కార్య క్రమంలో భాగంగా గడ్డం మహేష్,సట్ల ఉపేందర్,సాదాబొయిన రాజు,జక్కుల వీరేష్,పైండ్ల అశోక్,జనగాం రాజు,రాకం కార్తీక్ మహమ్మద్ ఖాజాపాషా,బానోత్ వెంకన్న,చెట్టబోయిన భవాని కొలిపాక భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సై గండ్రాతి సతీష్‌కు ఆత్మీయ వీడ్కోలు

**- కాంగ్రెస్ కార్యకర్తలు**

**తొలి అక్షరం/నర్సింహులపేట,ఆగస్టు14:** ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సహజమేనని తోట సురేష్ అన్నారు.బుధవారం నర్సింహులపేట ఎస్ఐ గండ్రాతి సతీష్ బదిలీపై కురవి మండలానికి వెళ్తున్న సందర్భంగా కొమ్ములవంచ గ్రామానికి చెందిన తోట సురేష్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన ప్రజల సమక్షంలో పోలీసు స్టేషన్ ఆవరణలో శాలువ కప్పి గజమాలతో సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు.అనంతరం సురేష్ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా,స్నేహపూర్వక వాతావరణంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరించారన్నారు. మండలంలోని పేద,నిరుపేద నిస్సయాలకు ఆర్థిక సహాయాలు, నిత్యావసర వస్తువులు అందిస్తూ, గూడు లేని అంధుడి కుటుంబానికీ ఇళ్లు నిర్మాణం చేయడం మరిచిపోలేనిదన్నారు.క్రీడాకారులకు క్రీడా సలహాలు ఇస్తూ ముందుకు నడిపించాడన్నారు.పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, గ్రూప్స్ పరీక్షలు రాసేవారికీ స్టడీ మెటిరీయల్ అందజేసినారన్నారు. సమస్యలతో స్టేషన్ కు వచ్చిన వారి స్థితి గతులు తెలుసుకొని వారికి ఆర్థిక సహాయం అందించారన్నారు.వీడ్కోలు పలికిన వారిలో నర్సింహులపేట గ్రామానికి చెందిన కడుదుల రామకృష్ణ,అలువాల శ్రీనివాస్,గౌని యాదగిరి,దూరు యాకన్న,గుండాల బిక్షం,ఆకుతోట సంపత్,బొచ్చన్నపేట గాడిపెల్లి శ్రీనివాస్,పల్లెల సోమేశ్వరరావు,భూపాల్ రెడ్డి,రూప్లతండ వీరన్న,నాగేష్,లచ్చు శ్రీనివాస్,సంతోష్,కొమ్ములవంచ శంకర్,లక్ష్మీనారాయణ,మురలి కౌసల్యదేవిపల్లి చల్ల మధు,ప్రశాంత్,వివిధ గ్రామాల ప్రజలు.




## మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించిన డ్రగ్స్ ఇన్స్పెక్టర్ ఉమారాణి



**తొలి అక్షరం/మానుకోట,ఆగస్టు14:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ పట్టణ కేంద్రంలోని డ్రగ్స్ ఇన్స్పెక్టర్ ఉమారాణి పలు మెడికల్ షాపులలో తనిఖీలు నిర్వహించారు.విలేకరులు తనిఖీలపై డ్రగ్స్ ఇన్స్పెక్టర్ ను సమాచారం అడిగిన ఎలాంటి విషయాలను వెల్లడించలేదు.ప్రతి నెల సాధారణ తనిఖీల్లో భాగంగా మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు.విలేకర్లు సమాచారాన్ని కోరగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వెళ్లిపోయారని మెడికల్ షాపుల్లో ఏమీ జరిగినదో తెలియచేయండి జిల్లా మెడికల్ అధికారి ఉమారాణి.

## సుబ్లేడు గ్రామంలో అత్యంత ఘనంగా ముత్యాలమ్మ బోనాల పండుగ

**తొలి అక్షరం/తిరుమలాయపాలెం,ఆగస్టు14:** పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు గ్రామంలో బుధవారం ముత్యాలమ్మ అమ్మవారికి గ్రామ ప్రజలు బొనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.బోనాలు సందర్భంగా బాజా బజంత్రీల నడుమ ముత్యాలమ్మ ఆలయములో పూజలు నిర్వహించి అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.గ్రామ పెద్దలు మాట్లాడుతూ బోనాలు మన సంస్కృతి సంప్రదాయానికి ప్రతీక అని, బోనాలు ఒక ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చాయని అన్నారు.అలాగే ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని అమ్మవారి చల్లని చూపు గ్రామ ప్రజల అందరిపై ఉండాలని గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని పాడి పంటలు సమృద్ధిగా పండాలని పూజలు నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి: ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్




**తొలి అక్షరం/నెల్లికుదురు,ఆగస్టు14:** స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా రుపాలన అభివృద్ధి పనులకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ అయన నియోజకవర్గంలో వివిధ పార్టీల నుండి కార్యకర్థలు కాంగ్రెస్స్ పార్టీ లో చేరడం చాలాశు భపరిణామం అని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలన్నారు. నేటి నుంచి ప్రతి కార్యకర్త ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియచెప్పలాని కోరారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్ళి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గొల్ల పల్లి ప్రభాకర్ గౌడ్ కాంగ్రెస్స్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బాలాజీ నాయక్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసం లక్ష్మారెడ్డి మాజీ వైస్ ఎంపిపి జెల్ల వెంకటేష్ మాజీ బ్లాక్ కాంగ్రెస్స్ అధ్యక్షులు నాయిని సత్యపాల్ రెడ్డి నాయకులు పట్నం శెట్టి నాగరాజు దాసరి ప్రకాష్ తూళ్ళ నరేందర్ గంకిడి ఎల్లారెడ్డి క్రాంతి రెడ్డి పిర్నాక సుధాకర్ డోనికని శ్రీ నివాస్ తదితరులు పాల్గొన్నారు. **బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిక:** మండలంలోని శ్రీ రామగిరి గ్రామానికి చెందిన బిఆర్ఎస్‌కి చెందిన కార్యకర్తలు ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.బుధవారం మండల కేంద్రము లోని పార్టీ కార్యాలయంలో శ్రీరామగిరి గ్రామానికి చెందిన లిఉద్యమ జేఏ సి నేత మండల అధ్యక్షులు, బిఆర్ ఎస్ పార్టీ వార్డ్ సభ్యులు మాదరి ప్రశాంత్ నేతృత్వంలో వారి అనుచరులను 20 కుటుంబాలను పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ ఆహ్వాణించారు.కాంగ్రెస్‌లో చేరిన వారిలో దుంద్ర వెంకటాద్రి, గుర్రాల సాయిలు, ఎన్నమళ్ళ గణేష్,చదల రవి, మాదరి సంజీవ, ఎస్కే మైబెల్లి, గోడిశాల విరస్వామి, ఎన్నమాల్ గణేష్, సంద ఉపేంద్రం, కడుదుల విరరెడ్డి,స్వామి. ముకేశ్. నవీన్. అభినష్. రమేష్, తదితరులు పాల్గొన్నారు.


# బోనమెత్తిన పిండిప్రోలు ఆడపడుచులు

**- అమ్మవారికి నైవేద్యం సమర్పించిన భక్తులు**
**- సిరిసంపదలతో తులతూగాలని వేడుకోలు**
**- సాంప్రదాయా దుస్తుల్లో మహిళలు**




**తొలి అక్షరం/ తిరుమలాయపాలెం, ఆగస్టు14:** ఆడపడుచుల బోనాలతో పిండిప్రోలు గ్రామం మురిసిపోయింది.ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక సంబరం వెల్లివిరిసింది. ముత్యాలమ్మ తల్లికి బోనం సమర్పించి భక్తజనం తరించిపోయారు.బోనం సమర్పించిన తమను చల్లగా చూడాలని, ఎలాంటి మహమ్మారి తమకు తగలకుండా కాపాడాలని అమ్మవారిని వేడుకున్నారు.బుధవారం తిరుమలాయపాలెం మండల పరిధిలో పాపాయిగూడెం జల్లేపల్లి పాతర్లపాడు సుబ్లేడ్ బచ్చోడు కాకరవాయి పైనంపల్లి జూపెడ పిండిప్రోలు తదితర గ్రామాలలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ముత్యాలమ్మ తల్లి కి బోనాలు సమర్పి ంచారు పిండిప్రోలు గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి బాలాజీ ఆధ్వర్యంలో ముత్యా లమ్మ తల్లి పండుగ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముత్యాలమ్మ తల్లి గుడి దగ్గర తెలంగాణ సాంప్రదాయాలు ఉట్టిపడే విధంగా మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి తమ ఇండ్లలో నుంచి బోనాలను ఎత్తుకుని సంతోషంగా అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.చిన్న పెద్ద అనే తారతమ్యం లేకుండా చిన్నారులు సైతం బోనాలు ఎత్తుకుని ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమం లో గ్రామ గ్రామపంచాయతీ కార్యదర్శి బానోత్ బాలాజీ నాయక్ మాజీ ఎంపిటిసి పులుగుజ్జు వెంకటేశ్వర్లు మాజీ సర్పంచ్ అంగడి వీరస్వామి సొసైటీ వైస్ చైర్మన్ చామకూరి రాజు సొసైటీ డైరెక్టర్ చల్లా వెంకటేశ్వర్లు గ్రామ పెద్దలు పప్పుల ఉపేందర్ దొండేటి ఆనందరావు రామనబోయిన రవి కమ్మ కోమటి నాగేశ్వరరావు పులిగుజ్జు వెంకటస్వామి చామకూరి శ్రీనివాస్ దొడ్డ గురవయ్య పసలాది ముత్తయ్య పదముత్తు సంజీవరావు పప్పుల నరసింహారావు గోపోజి పిచ్చయ్యలు పాల్గొన్నారు.

# తొర్రూర్ డివిజన్‌లో ఘనంగా ముత్యాలమ్మ బోనాల పండుగ





**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో(సాంబ),ఆగస్టు14:** తొర్రూర్ మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలోని బుధవారం ఆనవాయితీగా వస్తున్న ఆచారం కొనసాగిస్తూ పట్టణ ప్రజలు ముత్యాలమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు.

# ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్!



ఐపీఎల్ 2025 సీజన్ నేపథ్యంలో ముంబై ఇండియన్స్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ముంబై ఇండియన్స్ సారథ్య బాధ్యతల నుంచి హార్దిక్ పాండ్యాను తప్పించి సూర్యకుమార్ యాదవ్‌కు అప్పగించే అవకాశం ఉన్నట్లు సమాచారం. హార్దిక్ పాండ్యా ఫిట్‌నెస్ సమస్యల నేపథ్యంలోనే ముంబై ఇండియన్స్ మేనేజ్‌మెంట్ ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే సూర్యకుమార్ యాదవ్‌కు టీమిండియా టీ20 సారథ్య బాధ్యతలు దక్కగా.. హార్దిక్ పాండ్యాను వైస్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి కూడా తప్పించారు. ఐపీఎల్ 2025 సీజన్‌కు ముందు మెగా వేలం జరగనుండటంతో ముంబై ఇండియన్స్ కూడా జట్టును రీబిల్డ్ చేయడంపై ఫోకస్ పెట్టింది. రిటెన్షన్ చేసుకోవాల్సిన ఆటగాళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టింది. మెగా వేలం రూల్స్ ప్రకారం నలుగురు నుంచి ఐదుగురు ఆటగాళ్లను మాత్రమే రిటైన్ చేసుకునే అవకాశం ఉండటంతో జట్లన్నీ పూర్తిగా మారిపోనున్నాయి. ఐపీఎల్ మెగా వేలానికి సంబంధించి ఇప్పటికే బీసీసీఐ ప్రణాళికలు మొదలుపెట్టింది. ఈ ఏడాది డిసెంబర్‌లో మెగా వేలం నిర్వహించే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే రిటెన్షన్ పాలసీని రూపొందించడంపై ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఫోకస్ పెట్టింది. ఇప్పటికే ఫ్రాంచైజీలతో రిటెన్షన్ పాలసీ గురించి చర్చలు కూడా జరిపింది. 7-8 మంది ఆటగాళ్లను రిటెన్షన్ చేసుకునే అవకాశం ఇవ్వాలని ముంబై ఇండియన్స్ కోరినట్లు కూడా వార్తలు వచ్చాయి. అయితే ముంబై ఇండియన్స్ జట్టును మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ వీడుతున్నాడని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఐపీఎల్ 2024 సీజన్ ముంగిట ముంబై ఇండియన్స్.. రోహిత్ శర్మపై వేటు వేసి హార్దిక్ పాండ్యాను తమ నయా సారథిగా ప్రకటించింది. ఈ నిర్ణయంతో ముంబై ఇండియన్స్ జట్టులో విబేధాలు తలెత్తాయి. హార్దిక్ పాండ్యాకు సీనియర్లు ఎవరూ సహకరించలేదు. ఈ క్రమంలోనే ముంబై ఇండియన్స్ రిటెన్షన్‌కు రోహిత్, జస్‌ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్ ఒప్పుకోలేదని తెలుస్తోంది. ఈ క్రమంలోనే సూర్యకు సారథ్య బాధ్యతలు అప్పగించేందుకు ముంబై ఇండియన్స్ మేనేజ్‌మెంట్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. రోహిత్ శర్మ సారథ్యంలో ముంబై ఇండియన్స్ ఐదు సార్లు విజేతగా నిలిచింది. అయితే రోహిత్ శర్మ కెరీర్ చివరి దశలో ఉండటంతో టీమ్ భవిష్యత్తు గురించి ఆలోచించిన ముంబై ఇండియన్స్.. హార్దిక్ పాండ్యాను సారథిగా ఎంపిక చేసింది. కానీ ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. కనీసం సూర్య సారథ్యంలోనైనా జట్టు పూర్వ వైభవాన్ని అందుకుంటుందా? లేదా అనేది చూడాలి.

# బ్రిటీష్ సింగర్‌తో హార్దిక్ పాండ్యా డేటింగ్!



టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా.. బ్రిటీష్ సింగర్ జాస్మిన్ వాలియాతో డేటింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియా వేదికగా హాట్‌టాపిక్‌గా మారాయి. అంతేకాకుండా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఇద్దరూ ఒకరినొకరు ఫాలో చేసుకుంటుండటంతో ఈ వార్తలకు బలం చేకూరుతోంది. ఇటీవలే తాను ప్రేమించి పెళ్లి చేసుకున్న బాలీవుడ్ బ్యూటీ నటాషా స్టాంకోవిచ్‌తో హార్దిక్ పాండ్యా విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. ఈ విషయాన్ని ఇద్దరూ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. పరస్పర అంగీకారంతోనే తమ నాలుగేళ్ల వివాహ బంధానికి ముగింపు పలుకుతున్నామని పేర్కొన్నారు. 'నాలుగు సంవత్సరాల పాటు కలిసి ఉన్న తర్వాత నటాషా, నేను విడిపోవాలని పరస్పర అంగీకారంతో నిర్ణయించుకున్నాం. కలిసి ఉండటానికి సాధ్యమైనంతగా ప్రయత్నించాం. ఇద్దరి ప్రయోజనాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నాం. ఎన్నో మధుర క్షణాల అనంతరం, కుటుంబం ఏర్పడిన తర్వాత విడిపోవడం కఠిన నిర్ణయమే. ఆగస్త్య మా ఇద్దరితోనూ ఉంటాడు. అతని సంతోషం కోసం సహ తల్లిదండ్రులా మేం అండగా ఉంటాం. ఈ కష్టమైన సమయంలో మా గోప్యతకు సహకరించాలని, మాకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నాం'అని హార్దిక్, నటాషా ట్యాగ్ లైన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. విడాకుల అనంతరం నటాషా తన కుమారుడు అగస్త్యాతో కలిసి ముంబైని వదిలి సొంత దేశం సెర్బియా వెళ్లిపోయింది. ఇక విడాకులు తీసుకున్నా.. సోషల్ మీడియా వేదికగా ఈ జోడీ యాక్టీవ్‌గానే ఉంటుంది. నటాషా పోస్ట్‌లకు హార్దిక్ పాండ్యా లైక్ చేయడంతో పాటు కామెంట్ చేస్తున్నాడు. టీ20 ప్రపంచకప్ 2024 అనంతం వైస్ కెప్టెన్సీ బాధ్యతలు కోల్పోయిన హార్దిక్ పాండ్యా.. శ్రీలంక పర్యటనలో టీ20 సిరీస్ మాత్రమే ఆడాడు. వ్యక్తిగత కారణాలతో వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. ప్రస్తుతం హార్దిక్ పాండ్యా గ్రీస్‌లో ఉన్నాడు. అక్కడే విశ్రాంతి సమయాన్ని గడుపుతున్నాడు. తన హొటల్‌లోని స్విమ్మింగ్ పూల్ ముందు నడుస్తున్న వీడియోను హార్దిక్ పాండ్యా సోషల్ మీడియాలో అప్ లోడ్ చేశాడు. ఈ వీడియోకు బ్రిటన్ సింగర్, టీవీ నటి జాస్మిన్ వాలియా లైక్ కొట్టారు. నాలుగు రోజుల క్రితం సరిగ్గా ఇదే ప్లేస్ లో వాలియా కూడా ఫొటో దిగి ఇన్ స్టాలో షేర్ చేయగా.. ఈ పోస్టుకు పాండ్యా లైక్ కొట్టాడు. గతంలోనూ వాలియా పెట్టిన పలు పోస్ట్‌లకు పాండ్యా కామెంట్లు చేశాడు. ఈ క్రమంలోనే వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇద్దరూ కలిసే విహారయాత్రకు వెళ్లారని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. బ్రిటన్‌కు చెందిన జాస్మిన్ వాలియా నటి, సింగర్, యూట్యూబర్.. నివాసం ఇంగ్లండ్‌లోని ఎసెక్స్. టీవీ షోలు, రియాల్టీ షోల ద్వారా చాలా పాపులర్ అయ్యింది. సొంతంగా యూట్యూబ్ ఛానల్ పెట్టి పలు ఆల్బమ్‌లు చేసింది. ఆమె పాడిన 'బామ్ డిగీ' పాటను బాలివుడ్ సినిమాలో రీమేక్ చేశారు. బాలీవుడ్ సింగర్ ఆసిమ్ రియాజ్ తో కలిసి జాస్మిన్ ఓ మ్యూజిక్ వీడియో చేసింది.

# సీఎం రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలి


**- కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు లంజపల్లి శ్రీనివాస్**

**తొలి అక్షరం/తిరుమలాయపాలెం,ఆగస్టు14:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ నుముల రేవంత్ రెడ్డి ఆగస్టు 15న గురువారం వైరా నియోజకవర్గంలో కొత్తగూడెం భద్రాద్రి జిల్లాలో నిర్వ ఇస్తున్న పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు లంజపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు బుధవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో ఎస్సీ సెల్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ఆగస్టు 15 తేదీన ముందుగా గోదావరి సీతారాం ప్రాజెక్టు ప్రారంభోత్సవం జరుగుతుందని తర్వాత వైరాలో బహిరంగ సభ జరుగుతుందని అక్కడ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు రెండు లక్షల రుణమాఫీ విడుదల చేస్తారని తెలిపారు ఈ బహిరంగ సభలో రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘు రాం రెడ్డి రాజ్యసభ సభ్యురాలు గారపాటి రేణుక చౌదరి మంత్రులు ఎమ్మెల్యేలు కార్పొరేషన్ చైర్మన్లు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని ఈ బహిరంగ సభకు ప్రజలందరూ భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు. పిండిప్రోలు మాజీ ఉప సర్పంచ్ రావిండ్ల వెంకన్న సుధాకర్ రావిండ్ల సుధాకర్ నూక తొట్టి సాల్మన్ మట్టె వీరబాబు వనవాసం నరేందర్ రెడ్డి బొల్లి కొండ రమేష్ లంజపల్లి శ్రీకాంత్ లంజపల్లి ఉపేందర్ దోనెపల్లి శేఖర్ కోల వినోద్‌లు పాల్గొన్నారు.



# ఆదిపురుష్ ఫెయిల్ కావడంతో ఏడ్చేశాను

నటి కృతి సనన్



రెబల్ స్టార్ ప్రభాస్, బాలీవుడ్ నటి కృతి సనన్ ప్రధాన పాత్రల్లో వచ్చిన చిత్రం ఆదిపురుష్ బాక్సాఫీస్ వద్ద అట్టర్‌ఫ్లాప్‌గా నిలిచింది. ఇక ప్రభాస్ రాధేశ్యామ్ తర్వాత మరో డిజాస్టర్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. అయితే ఈ సినిమా పరాజయంపై తాజాగా స్పందించింది నటి కృతి సనన్. ఆదిపురుష్ ఫ్లాప్ అయినప్పుడు నేను చాలా బాధపడ్డాను. మనం ప్రాణం పెట్టిన సినిమాలు పరాజయం అయితే తీవ్ర కుంగుబాటుకు లోనవుతాం. కొన్నిసార్లు ఏడ్చేస్తాం. అయితే ఈ తప్పు ఎక్కడ జరిగిందోనని ఆలోచిస్తాం. ఎదుటివారి విశ్వాసాలు, మనోభావాలను దెబ్బతీయడం అనేది మా లక్ష్యం కాదు. ప్రతి ప్రాజెక్ట్ వెనుక ఉద్దేశం పాజిటివ్‌గానే ఉంటుంది. అయితే అప్పుడప్పుడు అది కొందరికి నచ్చకపోవచ్చు. ఏది ఏమైనా ఈ అనుభవాల నుండి మనం చాలా నేర్చుకుంటాం. ఒక నటిగా నేను ఎప్పుడు పాజిటివ్‌గా ముందుకెళ్లాలి. తర్వాతి ప్రాజెక్ట్‌లపై దృష్టి పెట్టాలి. ఒక సినిమా హిట్ అవ్వడం అనేది చాలా అంశాల మీదా ఆధారపడి ఉంటుంది. అప్పటివరకు మన పనిని మనం 100 శాతం పూర్తి చేసుకుంటూ వెళ్లాలి అంటూ కృతి వెల్లడించింది.గతేడాది 'క్రూ', 'తేరీ బాతోన్ మే ఐసా ఉల్జా జియా' సినిమాలతో హిట్లు అందుకున్న ఈ భామ ప్రస్తుతం దోపట్టి అనే సినిమాలో నటిస్తుంది. బాలీవుడ్ నటి కాజోల్ దేవ్‌గణ్ నటిస్తున్న ఈ సినిమాకు శశాంక చతుర్వేది దర్శకత్వం వహిస్తున్నాడు.

# డబుల్ ఇస్మార్ట్ కోసం రామ్ ఫీట్లు





థియేటర్లలో మాస్ ప్రేక్షకులను ఇంప్రెస్ చేయాలంటే హీరో ఏదో ఒక రిస్కీ ఫీట్ చేయాల్సిందే. మూవీ లవర్స్ కోసం అలాంటి రిస్క్ చేసే యాక్టర్లలో ఒకడు రామ్ పోతినేని. పూరీజగన్నాథ్ దర్శకత్వంలో రామ్ నటించిన చిత్రం డబుల్ ఇస్మార్ట్ . బ్లాక్ బస్టర్ హిట్ ఇస్మార్ట్ శంకర్ సీక్వెల్ ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ చిత్రంలో కావ్య థాపర్ హీరోయిన్‌గా నటిస్తోంది. డబుల్ ఇస్మార్ట్ ఆగస్టు 15న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా పూరీ టీం ఏదో ఒక అప్‌డేట్‌తో అభిమానులు, సినీ జనాల్లో క్యూరియాసిటీ పెంచుతోంది. కాగా ఈ సినిమా కోసం బాలీ (ఇండోనేషియా)కి వెళ్లి తక్కువ టైంలో తప్పనిసరి పరిస్థితుల్లో 18 కిలోలు బరువు తగ్గానని చెప్పాడు రామ్. కాగా ఈ మూవీలో గన్స్, రౌడీలతో స్టైలిష్ యాక్షన్ పార్టు ఉండబోతున్నట్టు ఇప్పటివరకు వచ్చిన రషెస్ చెప్పకనే చెబుతున్నాయి. దీని కోసం రామ్ ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నాడు. డబుల్ ఇస్మార్ట్ బీటీఎస్ స్టిల్స్ చూస్తే ఈ విషయం మీకే అర్థమవుతుంది. ఈ మూవీని నైజాంలో ప్రైమ్ షో ఫిలిమ్స్ విడుదల చేస్తుండగా.. తమిళనాడులో పాపులర్ ఫిలిం డిస్ట్రిబ్యూషన్ కంపెనీ శక్తి ఫిలిం ఫ్యాక్టరీ విడుదల చేస్తోంది. ఇప్పటికే ధిమాక్కిరికిరి డబుల్ ఇస్మార్ట్ టీజర్, ట్రైలర్ నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి. ఈ మూవీలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్నాడు. పూరీ కనెక్ట్స్ బ్యానర్ తెరకెక్కిస్తోన్న ఈ మూవీ ఆడియో హక్కులను పాపులర్ మ్యూజిక్ లేబుల్ ఆదిత్య మ్యూజిక్ సొంతం చేసుకుంది.

# ఆ హీరో కథ అటు ఇటు తిరిగి నితిన్ వద్దకు..



యంగ్ హీరో నితిన్ ప్రస్తుతం వెంకి కుడుముల దర్శకత్వంలో రాబిన్ హుడ్ మూవీ చేస్తున్నారు. డిసెంబర్ 20న ఈ చిత్రం రిలీజ్ కాబోతోంది. అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనర్ గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. దీంతో పాటు వేణు శ్రీరామ్ దర్శకత్వంలో నితిన్ తమ్ముడు మూవీ చేస్తున్నారు. దిల్ రాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 2025 ఆరంభంలో ఈ సినిమా రిలీజ్ అయ్యే అవకాశం ఉందంట.దీని తర్వాత నితిన్ మూవీ ఎవరితో ఉంటుంది అనే విషయంలో రకరకాల పేర్లు ఇండస్ట్రీలో వినిపించాయి. బలగం సినిమాతో దర్శకుడిగా సూపర్ సక్సెస్ అందుకున్న కమెడియన్ వేణు తన సెకండ్ ప్రాజెక్ట్ కోసం హీరోల వేటలో ఉన్నారు. ఈ సినిమాని నితిన్ తో చేసే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తోంది. నిజానికి ఈ ప్రాజెక్ట్ కోసం ముందుగా వేణు నాచురల్ స్టార్ నానిని కలిశారు.నాని సరిపోదా శనివారం రిలీజ్ తర్వాత శ్రీకాంత్ ఓదేల దర్శకత్వంలో ఒక సినిమా చేయబోతున్నారు. అలాగే హిట్ 3 సినిమా స్క్రిప్ట్ వర్క్ జరుగుతోందంట. దీంతో పాటు సుజిత్ దర్శకత్వంలో ఒక మూవీ ఫిక్స్ అయ్యింది. ఈ చిత్రాలు అన్ని ఒకదాని తర్వాత ఒకటి చేసుకుంటూ వెళ్లాల్సి ఉంది. దీంతో డేట్స్ అడ్జస్ట్ చేయలేనని వేణుతో చేయాల్సిన సినిమాని నాని రిజక్ట్ చేశారు. నెక్స్ట్ విశ్వక్ సేన్ తో ఈ సినిమాని తెరకెక్కించాలని వేణు భావించారు.అయితే విశ్వక్ సేన్ కూడా మెకానిక్ రాకీ తర్వాత మరో మూడు సినిమాలు బ్యాక్ టూ బ్యాక్ లైన్ లో పెట్టారు. వీటిని కంప్లీట్ చేసాక కృష్ణ చైతన్య దర్శకత్వంలో మరో సినిమా చేయాల్సి ఉందంట. వీటిని కంప్లీట్ చేస్తేగాని వేణుకి విశ్వక్ సేన్ డేట్స్ ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. అయితే నితిన్ తమ్ముడు ఈ ఏడాదిలోనే పూర్తి కానుందని తెలుస్తోంది. తరువాత ఆయన చేతిలో పెద్ద ప్రాజెక్ట్స్ ఏవీ లేవు కాబట్టి బలగం వేణు చిత్రాన్ని స్టార్ట్ చేసే ఛాన్స్ ఉందనే మాట వినిపిస్తోంది.ఈ సినిమాని కూడా దిల్ రాజు నిర్మించబోతున్నారని తెలుస్తోంది. అయితే వేణు ఈ సారి బలగం లాంటి కంటెంట్ బేస్డ్ మూవీ కాకుండా కమర్షియల్ యాక్షన్ జోనర్ లో కథని సిద్ధం చేసుకున్నారంట. నితిన్ కూడా మంచి యాక్షన్ కథలతో సక్సెస్ అందుకోవాలని అనుకుంటున్నాడు. ఇప్పటి వరకు అతనికి ఎంటర్టైన్మెంట్ కథల ద్వారానే సక్సెస్ వచ్చాయి. ఒక్క మాస్ బొమ్మ పడితే ఇమేజ్, మార్కెట్ కూడా పెరిగే ఛాన్స్ ఉందని నితిన్ భావిస్తున్నారని టాక్ వినిపిస్తోంది. అందుకే వేణు కథకి ఒకే చెప్పే ఛాన్స్ ఉందనే ప్రచారం నడుస్తోంది.

# స్నేహానికి ప్రాణమిచ్చే వ్యక్తి అల్లు అర్జున్

## 'ఆయ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో బన్నీ వాసు భావోద్వేగం



స్నేహితుడికి అవసరం ఉందంటే ఎలాంటి పరిస్థితుల్లోనైనా అల్లు అర్జున్ అండగా ఉంటారని నిర్మాత బన్నీ వాసు అన్నారు. 'ఆయ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆయన మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. అల్లు అర్జున్‌తో తనకున్న స్నేహాన్ని గుర్తుచేసుకున్నారు. 'నాకు కష్టం వచ్చిందంటే ఇద్దరు వ్యక్తులు ఎప్పుడూ మందుంటారు. వాళ్లలో ఒకరు మా అమ్మ అయితే.. రెండో వ్యక్తి నా స్నేహితుడు అల్లు అర్జున్. 'ఆయ్' సినిమా ప్రచారం సరిగ్గా జరగడంలేదని.. బన్నీని పోస్ట్ పెట్టమని అడగాలని మా టీమ్ వాళ్లు కోరారు. కానీ, నేను ఆయన్ను అడగలేదు. నేను సమాచారం ఇవ్వకుండానే ఆయనే తన ఎక్స్‌లో ఈ చిత్రం గురించి పోస్ట్ చేశారు. నాకు అవసరం ఉన్న ప్రతిసారి ఆయన ముందుండి నడిపిస్తారు. ఒక స్నేహితుడికి కష్టమొస్తే.. తనకు ఎలా సపోర్ట్ చేయాలని తెలిసిన ఏకైక వ్యక్తి నా దృష్టిలో అల్లు అర్జునే. 20 ఏళ్ల క్రితం నేను గీతా ఆర్ట్స్ నుంచి వెళ్లిపోవాల్సిన సంఘటన ఎదురైంది. ఆరోజు బన్నీ నాకు సపోర్ట్ చేయడం కోసం వాళ్ల నాన్నను కూడా ఎదిరించారు. అప్పుడు ఆయన సపోర్ట్ చేయకపోతే ఈరోజు నేను ఈ స్థానంలో ఉండేవాడిని కాదు. తన స్నేహితుల్లో ఎవరికి అవసరం వచ్చినా ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా బన్నీ సపోర్ట్ చేస్తాడు. మంచి వ్యక్తి' అంటూ తమ స్నేహాన్ని గుర్తుచేసుకున్నారు. 'సినిమాలకు సంబంధించిన విషయాలను సినిమా వరకు మాత్రమే ఆలోచించగల హీరో ఎన్టీఆర్. 'ఆయ్' ట్రైలర్‌ను పిఠాపురంలో చేయాలని నాకు అనిపించినప్పుడు ఎన్టీఆర్‌కు ఈ సమాచారాన్ని అందించాం. నిర్మాతకు ఉపయోగ పడుతుందంటే మిగతా విషయాలేవీ పట్టించుకోవద్దు అని చెప్పారు. ఈ విషయంలో ఆయనకు కృతజ్ఞతలు చెప్పాలి. నేను మొదటి నుంచి పవన్ కల్యాణ్ అభిమానిని. ఈరోజు ఆయనతో పాటు పొలిటికల్ జర్నీలో ఉంటున్నానంటే నా అదృష్టమని చెప్పాలి' అంటూ బన్నీ వాసు భావోద్వేగానికి గురయ్యారు. ఎన్టీఆర్ బావ మరిది నార్నె నితిన్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'ఆయ్' ... మేం ఫ్రెండ్సండి అనేది ఉపశీర్షిక. నయన్ సారిక హీరోయిన్. అంజి కె.మణిపుత్ర దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ప్రభాస్ సినిమాలో నేను లేను



**అభిమానులకు షాకిచ్చిన మృణాల్ ఠాకూర్**

వరుస విజయాలతో జోష్ మీదున్నారు ప్రభాస్. ఆయన హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన 'సీతారామం' బ్యూటీ మృణాల్ నటించనున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా వీటిపై ఆమె స్పందించారు. ప్రభాస్‌తో మృణాల్ ఉన్న ఫొటోను ఇన్‌స్టాలో ఓ నెటిజన్ పోస్ట్ చేశారు. 'ఇది హను రాఘవపూడి చిత్రం ఫస్ట్‌లుక్' అని ఆ ఫొటోకు క్యాప్షన్ పెట్టారు. ఈ పోస్ట్‌పై మృణాల్ స్పందించారు. 'మీ ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పెడుతున్నందుకు క్షమించండి. నేను ఈ ప్రాజెక్ట్‌లో లేను' అని కామెంట్ చేశారు. దీంతో రూమర్‌కు చెక్ పడింది. మరి ఇందులో ప్రభాస్ సరసన ఎవరు కనిపిస్తారో అనే చర్చ మరోసారి మొదలైంది. హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా ఓ పీరియాడికల్ డ్రామాగా ఈ చిత్రం రానుంది. దీనికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో ఇది తెరకెక్కనుంది. తాజాగా దీనికి సంబంధించిన టైటిల్ కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ చిత్రానికి 'ఫౌజీ' అనే పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన ఆగస్టు 17న రానున్నట్లు తెలుస్తోంది.